క్లుప్తంగా

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవంలో భాగంగా జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకా లోని గుండార్లహళ్లిలో ఆంజనేయస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ సమితి అధ్యక్షుడు జయంత్ తదితర పదాధికారుల నేతృత్వంలో మహిళలు జ్యోతులు మోశారు. ఆంజనేయస్వామి చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. అంతకు ముందు స్వామికి అభిషేకం, ఆకు పూజ, రామతారక మంత్ర హోమం, ప్రాకారోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మ కర్తలు జీఎస్ ధర్మపాల్, జీఎస్ ప్రసన్న కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

పెనుకొండ: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 10 ద్విచక్ర వాహనాలను ఈ నెల 27 ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



నగదు అందిస్తున్న దాతలు

రొళ్ల: కాల్వేపల్లిలోని రంగనాథస్వామి ఆలయ ఆవరణలో తలపెట్టిన కల్యాణ మంటపం నిర్మాణానికి బెంగళూరు (బెళ్లికళ్లి) చెందిన ముత్తప్ప తనయుడు సురేష్ కుటుంబ సభ్యులు విరాళం ప్రకటించారు. ఈమేరకు సోమవారం ఆలయ ఆవరణలో రూ.25 వేల నగదును లక్ష్మీరంగనాథస్వామి ధర్మ ప్రచార సేవ పరిషత్ ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటు

మడకశిరరూరల్: మండలంలోని ఛత్రం పంచాయితీలోని ఎగువ ఈచలెడ్డి గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామని సోమవారం సర్పంచ్ చెన్నయ్య తెలిపారు. గ్రామంలో వేసిన బోరులో నీరు పుష్కలంగా లభించాయని, వాటర్ స్కీమ్ బోరు నుంచి గ్రామంలోని కొత్తగా పైపులైన్ ఏర్పాటుకు జేసీబీతో పనులు చేపట్టామన్నారు. పైపులైన్ ఏర్పాటుతో వేసవిలో కూడా తాగునీటి సమస్య ఉండదని తెలిపారు.

ఘనంగా దత్తజయంతి




ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

పెనుకొండ: పట్టణంలో సోమవారం దత్త జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి స్థానిక తోటగేరి షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని సుందరంగా అలంకరించి, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదానం నిర్వహించారు.

వాజ్‌పేయికి నివాళి

మడకశిర: పట్టణంలో సోమవారం దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. సుకన్య ఆస్పత్రి ఆవరణంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశానికి వాజ్‌పేయి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

పావగడ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతి చెందింది. తిరుమణి గ్రామం సమీపంలోని తిరుమణి-వెంకటమ్మనహళ్లి మార్గం లో వేప చెట్టు కింద సుమారు 85 సంవత్సరాల వృద్ధురాలు అపస్మారక స్థితి లో ఉండడంతో అరుణ్ కుమార్ అనే వ్యక్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాడు. పరిస్థితి విషమించడంతో వృద్ధురాలి మృతి చెందింది. మృతురాలి ఆచూకీతెలిసిన వారు తిరుమణి పోలీస్ స్టేషన్ 08136-240047 ఫోన్ నంబరుకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఎస్‌ఐ లక్ష్మణ్ కోరారు.

ఏసు మార్గం అనుసరణీయం



హిందూపురం: ఓయిసిస్ బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



రొళ్ల మండలం కె.బ్యాడిగెరలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



పెనుకొండలో క్రిస్మస్ సందేశాన్ని వివరిస్తున్న పాస్టర్లు ఫ్రాన్సిస్, గోపాలరెడ్డి, సుధాకర్

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. ప్రతిఒక్కరూ ప్రభువు చూపిన ప్రేమమార్గంలో పయనించాలని పాస్టర్లు సందేశమిచ్చారు. ఈ సందర్భంగా చర్చీల్లో క్రైస్తవులు ఆలపించిన ఏసు భక్తి గీతాలు అలరించాయి. ప్రార్థనా మందిరాల్లో మేరీమాత, బాల ఏసు ప్రతిమలు, క్రిస్మస్ ట్రీ, పశువుల పాక నమూనాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

• ఘనంగా క్రిస్మస్ వేడుకలు

హిందూపురం: శాంతి మార్గాన్ని చూపడం కోసం ఏసు ప్రభువు ఈ లోకానికి వచ్చాడని పాస్టర్ కిరణ్‌మోహన్ అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సోమవారం హిందూపురం పట్టణంలోని క్రైస్తవులు వివిధ చర్చీల్లో ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో చర్చి కమిటీ సభ్యులు అనిల్‌కుమార్. టి.పాల్‌డికెన్ బోర్డు సభ్యులు కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఫాస్టర్ కిరణ్‌మోహన్ మాట్లాడుతూ ప్రభువు ఏసుక్రీస్తు పాపులను పరిశుద్ధాత్ములుగా మార్చి సన్మార్గం చూపించారన్నారు. ప్రభువు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఅండ్‌ఐజీ చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఅండ్‌ఐజీ కాంపౌండ్ చర్చి, పరిగి రోడ్డులోని జెరూసలెం చర్చిలో ఫాస్టర్ బిషప్ డాక్టర్ వి.రంగరాజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సిస్టర్ గ్లోరీ, కమిటీ సభ్యులు ఆనంద్, మూర్తి, భాస్కర్ తదతరులు పాల్గొన్నారు. అలాగే నానెప్పనగర్ బైబిల్ మిషన్‌చర్చి, సీఎస్ఐ చర్చి, డీఆర్ కాలనీలో జియాన్ చర్చి తదితర చోట్ల చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మానవాళి జీవితాల్లో ఆనందం నింపిన కరుణామయుడు

మానవాళి జీవితాల్లో ప్రేమ, కరుణ, శాంతి సందేశంతో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని హిందూపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. పట్టణంలోని కొట్నూర్‌లోని ఓయసిస్ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ పర్వదినాన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ శాంతిదూత జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ క్రైస్తవులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్, శ్రీరాములు, లక్ష్మీపురం జేమ్స్ బ్రదర్, బ్రదర్ బాబన్న, పట్టణ బీబ్లాక్ కన్వీనర్ నరేష్, కౌన్సిలర్ మల్లికార్జునగౌడ్, రమేష్, జగన్, పార్టీ నాయకులు మస్తాన్, షాజహాన్, వెంకటేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: అన్ని మతాలను గౌరవించాలని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జబీవుల్లా అన్నారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని సీఅండ్‌ఐజీ చర్చిలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపకుడు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో చర్చి కమిటీ సభ్యుడు ఇషాక్ పాల్ తదితరులకు కేక్‌ను తినిపించి ముస్లింలు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో క్రైస్తవ, ముస్లిం సామాజిక సంఘాలు పాల్. మింటూ మనోజ్, టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం షేక్ షబ్బీర్. అబ్దుల్ సలాం. ముసవ్విర్. జోజీ,రవికుమార్, సంపత్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఫాస్టర్ ఫ్రాన్సిస్, మడకశిర రోడ్డులో ఉన్న షాలేము చర్చిలో ఫాస్టర్ గోపాలరెడ్డి, బైబిల్‌మిషన్ చర్చిలో ఫాస్టర్ సుధాకర్, హోరేబు, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మడకశిర: పట్టణంలో సోమవారం కిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు ఈసందర్భంగా చర్చీలకు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రార్థనలు జరిపారు. మత పెద్దలు ఏసుప్రభువు బోధనలను చదివి వినిపించారు. క్రైస్తవులు కేక్‌లు కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి శుభాకాంక్షలు తెలిపారు.

పావగడ: స్థానిక ఆర్ఎంసీ యార్డు వద్ద ఉన్న ఇవ్యాంజెలికల్ హార్వెస్ట్ చర్చ్ ఆఫ్ ఇండియా చర్చిలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రామాంజనేయ అభిషేక్ రాయ్ తదితర కుటుంబీకులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఏసు ప్రభువు ను నమ్మినవారు భాగ్యకరమైన రక్షణ పొందుతారని బోధనలు చేశారు. పట్టణంలోని రొప్పం గ్రామం వద్ద ఉన్న జిప్సి చర్చి, శిరా రోడ్డులోని బ్రదర్స్ బెత్లహామ్ చర్చిలో పాస్టర్లు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అమరాపురం: ప్రపంచంలోని మానవళికి యేసు ప్రభువు రక్షకుడని పాస్టర్లు శ్రీనివాస్, ప్రకాష్‌రావు, సాల్‌మాన్‌రాజు, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు పేర్కొన్నారు. సోమవారం క్రిస్మస్‌ను అమరాపురంలోని షాలోమి, కెపెర్నహోం, బెరకా ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రార్థన మందిరాల్లో పాస్టర్లు యేసు ప్రభువు బోధనలను వినిపించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మత పెద్దలు కానుకలు అందజేశారు. అనంతరం హిందూ సోదరులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. మత పెద్దలు జయకుమార్, పుట్టోజిరావు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: కె.బ్యాడగెర, ఎం.రాయాపురం, గౌట్టుగుర్కి, రొళ్ల, కొడగార్లగుట్ట కాలనీ, టీడీ పల్లి, వన్నారనపల్లి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెంగళూరు, హిందూపురం నుంచి హాజరైన పాస్టర్లు బ్రదర్ జేమ్స్, ఎగ్విన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కె.బ్యాడగెరలో ఇమ్మానువేల్ ప్రార్థన మందిరంలో ఏసు ప్రభువు చిత్ర పటం వద్ద చిన్నారుల చేత కేక్‌కట్ చేసి స్వీట్లను పంచి పెట్టారు. చిన్నారులు వివిధ వేషాధారణలో సందడి చేశారు. వేడుకలకు హాజరైన వారికి అన్నదానం చేశారు.

గుడిబండ: ఫళారం గ్రామ సమీపాన సోమవారం 'క్రిస్మస్' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కరుణాకర్, సతీష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జేసీఎస్ కన్వీనర్ శివకుమార్ క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

గోరంట్ల: మండల వ్యాప్తంగా సోమవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఉదయం పట్టణంలోని పలు చర్చీలకు వెళ్లి కేక్ కట్ చేసి, వేడుకలు జరిపారు. అనంతరం చర్చీల్లో ప్రార్థనలు చేశారు. పట్టణంలోని బేతాళం , మిషన్ తదితర చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అగళి: మండల కేంద్రంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి .స్థానిక న్యూకోవినెంట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక కట్ చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పరిగి: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పండుగను జరుపుకున్నారు. పరిగి, శ్రీరంగరాజుపల్లి, సేవామందిరం, ఊటుకూరు, బీచిగానిపల్లి, మోదా తదితర గ్రామాల్లో సీఅండ్ ఐజీ మిషన్, బైబిల్ చర్చ్‌లతో పాటూ క్రీస్తు ప్రార్థన మందిరాల్లో వేడుకలు జరిపారు.



హిందూపురం: సీఅండ్‌ఐజీ చర్చిలో కేకు తినిపిస్తున్న ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు



పావగడలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



గుడిబండలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



అగళిలో మహిళలకు చీరలు పంపిణీ చేసిన దృశ్యం



శ్రీరంగరాజుపల్లిలోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాదర్



హిందూపురం: సీఅండ్‌ఐజీ చర్చిలో గీతాలాపన చేస్తున్న సభ్యులు



హిందూపురం: చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ కిరణ్‌మోహన్



హిందూపురంలోని జెరూసలెం చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

క్రిస్మస్ వేడుకల్లో పీఠాధిపతి



పీఠాధిపతికి కేక్ తినిపిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో సీఐఅండ్‌ఐజీ మిషన్ ఇతర ఐదు చర్చిల్లో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, మత పెద్దలు పాల్గొన్నారు. చర్చీల్లో కేక్‌లను కట్ చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తాజ్‌బాబా మాట్లాడుతూ క్రైస్తవుల ఆరాధ్య దైవం యేసుక్రీస్తును గుర్తు చేసుకుంటూ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కవి జాబిలి చాంద్‌బాషా, జాన్‌ప్రియనాథ్, రవిశంకర్ గురూజీ తదితరులు పాల్గొన్నారు.



అమరాపురంలో ఏసు బోధనలు వినిపిస్తున్న పాస్టర్ ప్రకాష్‌రావు



బీచిగానిపల్లిలో మాట్లాడుతున్న ఫాదర్ సుధాకర్

మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిరలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో మడకశిర రూరల్ మండలం, మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలుపే ధ్యేయంగా పెట్టుకుని కార్యకర్తలు ఎన్నికల్లో పని చేయాలన్నారు. ఎన్నికలకు కేవలం మూడు నెలల సమయం మాత్రమే ఉందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, తద్వారా పార్టీని విజయపథం వైపు నడిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేస్తే గెలుపు తథ్యమని తెలిపారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని పొందారన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ,మండల కన్వీనర్ రామిరెడ్డి, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్రయాదవ్, విక్రమ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, డైరెక్టర్ నాగరాజగౌడ్, వైస్ ఎంపీపీలు మూర్తి, శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్ర, అన్సర్, మేఘన రమేష్, శ్రీనివాసులు, అంజన్, నాయకులు జయరాజ్, సత్యనారాయణరెడ్డి, మంజునాథ్, జమ్మానిపల్లి మూర్తి, నాగభూషణ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రొళ్ల మండలం గుడ్డగుర్కిలో మాట్లాడుతున్న అధికారులు

రొళ్ల: గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తామని ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్ణప్ప పేర్కొన్నారు. సోమవారం హులికుంట, గుడ్డగుర్కి సచివాలయాల ఆవరణలో సర్పంచులు కరియమ్మ, హరిక్రిష్ణ అధ్యక్షతన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు పీఎం కిసాన్, ఆహార భద్రత, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, పీఎంజేవై, ఐఏవై, ఐకేపీ, జల్‌జీవన్ మిషన్ తదితర పథకాలపై ప్రజలకు వివరించారు. మంగళవారం రత్నగిరి, దొడ్డేరి, బుధవారం కాకి సచివాలయాల ఆవరణలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ లింగరాజు, ఏపీఓ ఓబుళప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, వైకేపీ సీసీలు, ఆరోగ్య, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తెలిపారు. మంగళవారం ఉదయం 9:30 గంటలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రారంభిస్తారని తెలిపారు.

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి స్థానిక ఎంజీఎం గ్రౌండ్‌లో ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, పీఈటీలు సోమవారం పరిశీలించారు. క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా ఆటస్థలం శుభ్రం చేసి, క్రీడల నిర్వాహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

పరిగి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సరస్వతి ఓ ప్రకటనలో కోరారు. ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంలో నోడల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆయా సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పీడీలు, పీఈటీలు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం జరగనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఓ ప్రకటనలో తెలిపారు.

అగళి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. సోమవారం శని మహాత్ముని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా పోటీలు జరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి పోటీలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్ల ఏర్పాటు

హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో చెత్త తొలగింపునకు 16 మంది పారిశుధ్య కార్మికులు, నాలుగు ట్రాక్టర్లను కాంట్రాక్టు పద్ధతి ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం వాహనాల వినియోగం ప్రారంభించారు.

మనువాదం దళితులకు వ్యతిరేకం

పావగడ: మను వాదం దళితులు, బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేక మని, అభివృద్ధి నిరోధకమని స్థానిక కేబీఎస్(కర్ణాటక బౌద్ధ సమాజం) అధ్యక్షుడు సుబ్బరాజు తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సోమవారం నిర్వహించిన మను స్మృతి పుస్తక దహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్రకులాలకు అనుకూలంగా ఉన్న మను స్మృతి పుస్తకాన్ని 96 ఏళ్ల క్రితం అంబేడ్కర్ దహనం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మను స్మృతి పుస్తకాన్ని దళిత సంఘం నాయకులు దహనం చేశారు. డీజేఎస్ నారాయణప్ప, విజయకుమార్, మద్దిలేటి, రామాంజినప్ప, టీఎన్‌పేట రమేశ్ పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

అమరాపురం: మండల కేంద్రంలో సాయిదుర్గా హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు జీ.బీ.శివకుమార్ ఆధ్వర్యంలో ఉజ్వల గ్యాస్ సిలిండర్లను పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్, రెగ్యులేటర్, స్టౌలను అందజేస్తున్నామన్నారు. మొత్తం 400 మందిని ఎంపిక చేయగా ప్రస్తుతం 50 మందికి కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. నిర్వాహకులు నాగరాజు, కరుణాకర్, సిబ్బంది రవికుమార్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

పరిగి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో మండల కేంద్రానికి చెందిన మున్నా కైసర్ దంపతులు మాలధారులకు సోమవారం భిక్ష ఏర్పాటు చేశారు.

వాహనాల వేలం వాయిదా

మడకశిర: మడకశిర సెబ్ స్టేషన్‌లో సోమవారం జరగాల్సిన వాహనాల బహిరంగ వేలం పాటను వాయిదా వేసినట్లు సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. మళ్లీ వాహనాల వేలం పాటను ఈనెల 28 ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాబయ్యస్వామిని దర్శించుకున్న మేయర్

పెనుకొండ: పెనుకొండ బాబయ్య స్వామి గంధం, ఉరుసు వేడుకల్లో అనంతపురం మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఛైర్మన్ రిజ్వాన్, మైనార్టీ విభాగం అధ్యక్షులు సైపుల్లాబేగ్ దర్శించుకున్నారు. అనంతరం బాబయ్య స్వామి సమాధికి పట్టు వస్త్రం సమర్పించారు.